

చిలకలూరిపేట ఎన్ఆర్‌టీ సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాకకోసం వర్షంలో వేచి చూస్తున్న అభిమానులు



శావల్యాపురం సెంటర్‌లో జగన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులు



ఉప్పలపాడు వద్ద జగనన్న రాకకోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

అడుగడుగో... జగనన్నా..!

- జననేతకు జన నీరాజనం
- మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- మూడు నియోజకవర్గాల్లో కదంతొక్కిన పార్టీ శ్రేణులు
- చిలకలూరిపేట, బసికాపురం, ఎస్ఆర్‌కెటీ జంక్షన్, ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదగా వినుకొండలో పర్యటన
- జగనన్న పర్యటనతో కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం
- ఫలించని పచ్చ కుతంత్రాలు!



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగనన్నతో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న అభిమానులు, కార్యకర్తలు



ఉప్పలపాడు వద్ద అభిమానులతో కరచాలనం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నరసరావుపేట నియోజకవర్గ ప్రజలు ఘనస్వాగతం పలికారు. వినుకొండలో హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. తాడేపల్లి నుంచి బయలుదేరిన వైఎస్ జగన్ చిలకలూరిపేట నుంచి నరసరావుపేట మీదగా వినుకొండ వెళ్లారు. బసికాపురం వద్ద నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన వైఎస్ జగన్‌కు అడుగడుగున ఘనస్వాగతం లభించింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు, వృద్ధులు సైతం జగనన్న రాకకోసం రోడ్లపైకి వేచి ఉన్నారు. గ్రామగ్రామాన ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలతో జగనన్న సైతం కారు నుంచి బయటకు వచ్చి వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. యువకులు జగనన్నతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. పలు చోట్ల యువకులు, మహిళలు జగన్ ప్రయాణిస్తున్న కారుకు అడ్డుగా నిలిచి బయటకు రావాలని పట్టుబట్టారు. జగన్ బయటకు వచ్చి వారితో కరచాలనం చేస్తూ కాన్వాయ్‌ను ముందుకు కదిలించారు. దీంతో జగన్ షెడ్యూల్‌లో బాగా ఆలస్యం జరిగింది. ప్రకటించిన షెడ్యూల్‌కు రెండు గంటలకు పైగా ఆలస్యంగా నరసరావుపేట నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. అయినప్పటికీ జోరు వానలో ప్రజలు రోడ్ల మీదకు వచ్చి వేచి ఉండటం కనిపించింది. బసికాపురంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోన రఘుపతిలు మాజీ సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ వంపుగుడి రాజేష్, జాన్‌లు వీరి వెంట ఉన్నారు. బసికాపురం, కేసానుపల్లి మీదగా ఎస్ఆర్‌కెటీ జంక్షన్‌కు చేరుకున్న జగన్‌కు పట్టణ, సమీప గ్రామాల నుంచి వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు అక్కడికి చేరుకుని స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి మద్దిరెడ్డి నరసింహా రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు జ్ఞాపికను అందజేశారు. ఉప్పలపాడు చేరుకున్న జగనన్నకు మహిళల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. వందలాది మహిళలు రోడ్డు మీదకు జగన్‌కు స్వాగతం పలికారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలు జగన్‌ను కలిసి ఆయన వెంట కాన్వాయ్‌లో ప్రయాణించారు. జగనన్నకు స్వాగతం పలుకుతూ పెట్లూరివారిపాలెంలో భారీఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామంలో పలు చోట్ల కారు నుంచి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండలో పరామర్శకు వెళ్తున్న సందర్భంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో ఘన స్వాగతం లభించింది. ఒకవైపు వర్షం కురుస్తున్నా, మరోవైపు సోషల్ మీడియా వేదికగా 144 సెక్షన్ అమలులో ఉందనీ, ఎవరూ గుమిగూడరాదంటూ పచ్చదళం తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహించినా... పోలీసులు సైతం జనసమూహం చేరకుండా చెల్లాచెదురు చేసే ప్రయత్నాలు చేసినా... జనహృదయనేత పట్ల ప్రజలు తమ అభిమానపు జల్లులు కురిపించారు. దారులకు ఇరువైపులా నిలబడి ఆత్మీయ స్వాగతం పలికారు.

చిలకలూరిపేట పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోసం రాకకోసం వర్షంలో సైతం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అభిమానులు వేచి చూశారు. జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ఎన్ఆర్‌టీ సెంటర్‌కు చేరుకునే సరికి ఒక్కసారిగా జై జగన్ అనే నినాదాల హోరు నడుమ ఘనస్వాగతం పలికారు. ఒక్కసారిగా నలువైపుల నుంచి కాన్వాయ్‌ను చుట్టు ముట్టిన జన సమూహానికి జననేత కారులో ఒకవైపు నిలుచుని ప్రజలకు అభివాదం చేశారు. జగనన్నకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ స్వాగతం పలికారు. ఒక్కసారిగా జనం కాన్వాయ్‌ను చుట్టుముట్టిన నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కారులో నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుగా సాగారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండలో దారుణ హత్యకు గురైన రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళుతున్న సందర్భంగా శుక్రవారం శావల్యాపురం మండల కేంద్రం అభిమానులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ నాయకుడిని ఆప్యాయంగా పలకరించేందుకు మహిళలు బారులు తీరారు. దీంతో పోలీసులు అభిమానులను రోప్‌లు ద్వారా కట్టడి చేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ప్రతి గ్రామంలో జగన్‌మోహన్‌రెడ్డికి కరచాలనం ఇవ్వడంతో పాటు జై.. జగన్ అంటూ నినాదాలు హోరెత్తినాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు కార్యకర్తలు జోష్ నింపడానికి నవ్వుతూ రెండు చేతులు జోడించి నమస్కారం పెడుతూ ముందుకు సాగారు. వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, రూరల్ సీఐ యంపరాల అచ్చయ్య, ఎస్సై చల్లా సురేష్ తన పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్ దారుణ హత్యకు గురైన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వినుకొండ వచ్చారు. నియోజకవర్గంలో రహదారి పొడవున జోరు వానలో సైతం అభిమానులు, మహిళలు, కార్యకర్తలు అడుగడుగునా జగన్‌కు స్వాగతం పలికారు.

రోడ్డుకు ఇరువైపులా జగన్ రాక కోసం ఎదురు చూస్తూ జగన్ కాన్వాయ్‌ని అడ్డుకొని మరీ జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి దగ్గర నుంచి రాజీవ్ రజక కాలనీ, నిర్మలా స్కూల్, డ్రైవర్స్ కాలనీ మీదుగా రషీద్ ఇంటి వరకు ఇసుకేస్తే రాలనంత జనం జగన్ కోసం వేచి ఉన్నారు. జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రషీద్ కుటుంబాన్ని పరామర్శించాల్సి ఉండగా అడుగడుగునా కార్యకర్తలు, అభిమానులు జగన్ కాన్వాయ్‌ని ఆపడంతో వినుకొండ చేరుకునేటప్పటికీ ఆలస్యమైంది. ఉదయం 10 గంటల నుంచి రషీద్ ఇంటి వద్ద బజారులో మహిళలు, అభిమానులు, నాయకులతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. మధ్యాహ్న సమయం కల్లా జగన్ రాక కంటే ముందే దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తానిపర్తి చంద్రశేఖర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ మంత్రి పేర్ని నాని, అంబటి రాంబాబు, విడదల రజని, పత్తిపాడు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబులతో పాటు జీడీసీసీబీ చైర్మన్ లాలిపురం రాముతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ నాయకులు రషీద్ ఇంటి వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పెట్లూరివారిపాలెంలో జగనన్నకు స్వాగతం పలుకుతూ బాణసంచా కాలుస్తున్న అభిమానులు

జన నీరాజనాలు...

చిలకలూరిపేట బ్యాంక్ కాలనీ వద్ద ఉన్న పార్టీ కార్యాలయం వద్ద గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు మాజీ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరిన కాన్వాయ్‌ను పట్టణంలోని పోలిరెడ్డిపాలెం వద్ద భారీగా చేరిన మహిళలు ఘనస్వాగతం పలికి ఆత్మీయత చాటుకున్నారు. చిలకలూరిపేట మండలం కావూరు, లింగంగుంట్ల గ్రామాల మధ్య ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి స్వాగతం పలికారు. వారికి వైఎస్ జగన్ వాహనం దిగి కరచాలనం చేసి ముందుకు సాగారు. కోమటినేని వారిపాలెం వద్ద, అమీన్‌సాహెబ్‌పాలెం, బసికాపురం గ్రామాల మధ్య కనపర్రు, తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అభిమానం చాటుకున్నారు.

ఫలించని కుతంత్రాలు...

వైఎస్ జగన్ పర్యటన ఖరారు కావడంతోనే పార్టీ శ్రేణులు మార్గమధ్యంలో జననేతను చూడాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం పంచుకున్నారు. వాటిని చూసిన పోలీసులు, పార్టీ నాయకులకు ముందు రోజు రాత్రే ఫోన్లు చేసి హైవే వద్దకు రావద్దంటూ హెచ్చరించారు. ఎక్కడా పార్టీ జెండాలతో కనిపించరాదని హుకుం జారీ చేశారు. అంతటితో ఆగక శుక్రవారం ఉదయం నియోజకవర్గానికి ప్రవేశ మార్గంగా జాతీయ రహదారిలోని బోయపాలెం, వంకాయల పాడు, యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ ఎదురు హైవే కటింగ్ వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేశారు. హైవే వద్దకు వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను ఎప్పటికప్పుడు ఎక్కడా నిలబడ నీయకుండా పంపించి వేశారు. అయినప్పటికీ వైఎస్ జగన్ కాన్వాయ్ నియోజకవర్గంలోకి ప్రవేశించగానే ఎవరికి వారే పరుగున వచ్చి హైవే కటింగ్‌ల వద్ద నిలబడి జగనన్నకు జేజేలు పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదే చిలకలూరిపేట పట్టణంకు కాన్వాయ్ చేరుకునే సరికి ఎలాంటి ఆంక్షలు అభిమానానికి అడ్డు కాలేక పోయాయి. అక్కడి నుంచి నియోజకవర్గం దాటే వరకు అడుగడుగునా అభిమానం వెల్లివిరిసింది.



ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో చుట్టుముట్టిన అభిమానులకు అభివాదం చేస్తున్న జగనన్న



నరసరావుపేట రోడ్డు బసికాపురం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి



జగన్ రాక కోస ఎదురుచూస్తున్న అభిమానులు



జగనన్న రాక కోసం ఇళ్ల ఎదుట ఎదురుచూస్తున్న మహిళలు, కార్యకర్తలు



శావల్యాపురంలో పోలీసు బందోబస్తును పర్యవేక్షణ చేస్తున్న సీఐలు



ఉప్పలపాడు వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

క్లుప్తంగా

నేడు ఐసీఎంలో శ్రీగురుగీతా హోమం



నాదెండ్ల: గణపవరం ఇడుపులపాడు కాటన్ మిల్సు ఆయిల్ డివిజన్ గోడౌన్‌లో శనివారం ఉదయం 7 గంటల నుంచి శ్రీ గురు గీతా హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేతినేని శ్రీహరిరావు చెప్పారు. చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో 108 హోమగుండాలతో 151 రకాల విశేష హోమ ద్రవ్యాలతో సామూహిక హోమసహిత సంపూర్ణ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమం వలన భగవంతుడి అనుగ్రహం ప్రాప్తిస్తుందని పేర్కొన్నారు. ఒక్కో హోమగుండం వద్ద ఒక్కో కుటుంబ సభ్యులు పాల్గొనేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హోమగుండాలను ఇటుకలతో కట్టి, ఆవుపేడతో అలికి, ఇసుకతో నింపి నాలుగు వైపులా బొట్లు పెట్టి స్వస్తిక్ గుర్తులు దిద్ది, పుష్పాలతో అలంకరించినట్లు తెలిపారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. హెచ్ఎం సుందరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు. జిల్లాలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించటం మంచి విషయమన్నారు. ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలను బోధించి మెరుగైన పద్ధతులు అవలంబించాలని కోరారు. విద్యార్థుల ఉన్నతికి దోహదపడాలని కోరారు. ఉత్తీర్ణతలో పాఠశాలకు, గ్రామానికి జిల్లాలోనే పేరు సాధించేలా ఫలితాల్లో పోటీపడాలని కోరారు.

మెనూ ప్రకారమే ఇవ్వండి



నాదెండ్ల: తూబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని మండలస్థాయి అధికారులు తనిఖీ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జంగు జరీనా బేగంతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. ఈ పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 133 మంది విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నందున సంతోషం వ్యక్తం చేశారు. మెనూ తప్పకుండా విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థినుల్లో రక్తహీనత, ఆరోగ్య సమస్యల గురించి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శితో కలిసి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఏఎన్ఎం మానస తదితరులు ఉన్నారు.

యడ్లపాడు మండల నూతన ప్రత్యేక అధికారిగా సుబ్రమణ్యం



యడ్లపాడు: మండల నూతన ప్రత్యేక అధికారిగా ఎ.సుబ్రమణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు యడ్లపాడు మండల ప్రత్యేక అధికారిగా పనిచేసిన రాధారాణి ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో పల్నాడు, గుంటూరు జిల్లాల సెరికల్చర్ విభాగ అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రొంపిచర్లలో ఆగని వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం ఉదయానికి 35.4 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. కాగా పగలంతా ఆకాశం మేఘావృతమై ఎడతెరపి లేకుండా వాన జల్లులు పడ్డాయి. చిరు జల్లులతో చిత్తడి వాతావరణం నెలకొంది. వర్షం కారణంగా వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. రైతులు, రైతు కూలీలు వర్షం కారణంగా గృహాలకే పరిమితమయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్పాళ్ల: చెరువులో జారి పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లంకెల కూరపాడు గ్రామానికి చెందిన పచ్చల రామయ్య(53) గ్రామంలోని చెరువుకు కాపలాగా ఉంటాడు. ఈ నెల 12వ తేదీన చెరువులో జారిపడ్డాడు. తెల్లవారిన తర్వాత స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు. రామయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమరావతి గురుకుల పాఠశాలలో తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కె.సునీల్ రాజ్‌కుమార్

అమరావతి: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి కె. సునీల్ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతిగృహం, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బోధనా పద్ధతులు, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అకడమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవరావు, సంయుక్త కార్యదర్శి యోగేశ్వరరావు, రాజేష్, వైస్ ప్రిన్సిపల్ మేరీకళ, సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతులకు పెట్టుబడి సాయం అందించాలి’

అమరావతి: కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని మునగోడు తదితర గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల కన్వీనర్ బి. సూరిబాబు మాట్లాడుతూ.. గతేడాది తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల్లో కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ మొహిద్దీన్, కృష్ణ,ఎస్‌కే రఫీ, ఎం. సుబ్రహ్మణ్యం, నండూరి వెంకటేశ్వరరాజు, సయ్యద్ రహీంతుల్లా, పరమేశ్వరరావు, మేకల నీలగిరి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ ప్రజావేదిక నేడు

ముప్పాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సర ప్రజావేదిక సభ శనివారం జరుగుతుందని ఆ పథకం ఏపీఓ జి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ఉదయం 11 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు. పథకంలో అక్రమాలు, సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకు రావచ్చన్నారు.

పౌరాణిక కళాకారుడికి అభినందనలు

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ ‘అల్లూరి సీతారామరాజు నట కళా సామ్రాట్’ పురస్కారాన్ని అందుకున్నందుకు పలువురు అభినందించారు. శ్రీశైలం దేవస్థానం కమిటీ, లిటిల్ ఛాంప్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల ప్రముఖులకు జరిగిన అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను అలరిస్తున్నందుకు అవార్డుకు ఎంపిక చేశారు. రవికుమార్‌కు అశోక చక్రం ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంసాపత్రం కూడా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల సభ్యులు అభినందనలు తెలిపారు.